స్టేషన్‌ఘన్‌పూర్‌లో కుక్కల బెడద

- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లిలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల పట్టణంలో కుక్కల సమస్య తీవ్రం కావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా సంబంధిత మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లిలో పదుల సంఖ్యలో గ్రామ సింహాలైన శునకాలు అనునిత్యం రోడ్లపై ఇష్టారాజ్యంగా సంచరిస్తూ రోడ్ల వెంట వెళ్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రధానంగా స్థానిక గాంధీ చౌరస్తా నుంచి రైల్వేగేటు రోడ్డు, ఘన్‌పూర్ శివాలయం వీధి, ఈద్గా, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియాల్లో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. అదేవిధంగా శివునిపల్లిలో వివేకానంద చౌరస్తా, బరోడా బ్యాంకు, మజీద్, లయోల హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, శివునిపల్లి బొడ్రాయి తదితర ప్రాంతాల్లో కుక్కల సమస్య అధికంగా ఉంది. స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లిలో రోడ్ల పక్కన చికెన్, మటన్ సెంటర్లు నిర్వహిస్తున్న వారు ఇష్టారాజ్యంగా రోడ్ల పక్కన వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగుంపులుగా సంచరిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో రోడ్లపై ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వారి వెంట పడుతూ కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ క్రమంలో పలువురు గతంలో రోడ్డు ప్రమాదాలకు గురైన సంఘటనలు సైతం ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు

కుక్కల సమస్యపై స్థానికులు పలుమార్లు గత గ్రామ పంచాయతీ, ప్రస్తుత మున్సిపల్ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. గతంలో పలువురు పెద్దలు, పిల్లలు కుక్క కాటుకు గురైన సంఘటనలు ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి నెలలో కనీసం పది కుక్క కాటు కేసులు వస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వివిధ పనులపై ద్విచక్రవాహనాలపై, కాలినడకన వెళ్ళేవారిపై, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపై గతంలో కుక్కలు దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది స్పందించి కుక్కల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఘన్‌పూర్ శివాలయం వీధిలో సంచరిస్తున్న కుక్కలు



తహసీల్ రోడ్డులో శునకాలు

క్లుప్తంగా

ఖాళీ బిందెలతో నిరసన



తరిగొప్పుల: మండలకేంద్రంలోని 13వార్డులో సరిపడా తాగునీరు రావడంలేదని కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో గురువారం నిరసన తెలిపారు. మిషన్ భగీరథ నీరు సరిపోడం లేదని 20 రోజులుగా గ్రామపంచాయతీ నీళ్లు రాకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో ఉపేంద్ర, నరసమ్మ, లచ్చవ్వ, పరమవ్వ, నీలమ్మ, సంధ్య, సమ్మవ్వ, కనకవ్వ, కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



బచ్చన్నపేట: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఫోన్‌కు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయొద్దని, అపరిచిత వ్యక్తులకు వివరాలను తెలుపకూడదన్నారు. కానిస్టేబుళ్లు రాకేష్, యాదగిరి, తిరుపతి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య



లావణ్య మృతదేహం

నర్మెట: క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గండిరామవరం గ్రామంలో గురువారం జరిగింది. ఎస్సై నగేష్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముక్కెర సంపత్ భార్య లావణ్య (30) ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన వారు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో క్షణికావేశంలో పురుగుల మందుతాగినట్లు మృతురాలి భర్త ముక్కెర సంపత్ ఫిర్యాదు మేరకు ఘటనా స్థలం వద్దకు ఎస్సై వెళ్లి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..

జఫర్‌గఢ్: మండలంలోని తిడుగు గ్రామానికి చెందిన మాదారపు లక్ష్మయ్య (78) ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై బి.రామారావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లక్ష్మయ్య అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 26వ తేదీన బాత్‌రూమ్‌లో కాలుజారి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా కొద్ది రోజులు చికిత్స పొంది మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని శవపంచనామ నిర్వహించి దర్యాప్తు చేస్తున్న ఎస్సై పేర్కొన్నారు. కాగా, మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'స్థానికం'లో సత్తాచాటాలి



పాలకుర్తి: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుని పార్టీ సత్తా చాటాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్ద తండా, రాఘవపురంలో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ముస్కు శ్రీను, లకావత్ రవి, పోగు శ్రీనివాస్, భూక్య మల్లేశం పాల్గొన్నారు.

బీసీ సామాజిక వర్గ అభ్యున్నతికి కృషి



దేవరుప్పుల: జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారం సిద్ధించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 రిజర్వేషన్ కల్పన కోసం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అన్నారు. గురువారం ధర్మాపురం, కోలుకొండ ఎంపీటీసీ క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పల సురేష్‌బాబు, జిల్లా కార్యదర్శి పాండు కృష్ణ, దావెర అనిల్,సజ్జన్‌నాయక్, యూత్ మండల అధ్యక్షుడు పులిగిళ్ల వెంకన్న, నల్ల సత్యనారాయణ, పెద్దులు, సంగి కుమార్, రవి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయండి

- డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి విక్రమ్



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న విక్రమ్

తరిగొప్పుల: బాలబాలికలు లైంగిక వేధింపులకు గురవుతున్నారనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పోక్సో చట్టం తీసుకురావడం జరిగిందని, ఎవరైనా బాలబాలికలు లైంగిక వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, న్యాయమూర్తి జస్టిస్ సి.విక్రమ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని కేజీబీవీ ఆశ్రమ పాఠశాలలో స్థానిక ఎస్సై గుగులోత్ శ్రీదేవి ఆధ్వర్యంలో పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై వివరించారు. లైంగిక వేధింపులకు గురైన బాధితురాలు ఫిర్యాదు చేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఒక మహిళా పోలీసు అధికారితో ఫిర్యాదును స్వీకరించి పూర్తి విచారణ పూర్తి చేసి నేరం రుజువైతే నిందితుడికి పోక్సో కోర్టులో 10 సంవత్సరాలు తగ్గకుండా శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ అబ్బయ్య, భరోసా సెంటర్ అడ్వకేట్లు దయామణి, సుధారాణి, ఎంఈఓ నెల్లుట్ల జానకి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి సునీత తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం

- సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్



అశోక్

కొడకండ్ల: మన ఆలోచనలు, ఆచరణలు అన్ని కూడా మెదడు పైనే ఆధారపడి ఉంటాయి, మెదడే లేకుంటే ఇంజన్ లేని రైలు, దారంలేని గాలిపటం అవుతుందని తెలంగాణ రాష్ట్ర సైకాలజిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోగు అశోక్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన పలు సూచనలు చేశారు. కర్తవ్యాలను నేరవేర్చుకుంటూ, లక్ష్యాలను చేరుకుంటూ ఆనందంగా జీవించేందు కోసం ఇతర శారీరక అవయవాలతో పాటు మానసిక ఆరోగ్యం సంతృప్తికరంగా ఉండేలా ప్రతీ ఒక్కరు చూసుకోవాలని ఆయన సూచించారు. ప్రణాళికలు రచించుకోవడానికి జాగ్రత్తలు తెలుసుకొని పాటించడానికి ఉద్దేశించినదే ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవమని, మానసిక ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తే అనేక దీర్ఘకాలిక, శారీరక సమస్యలు ఉత్పన్నమై మెదడుపై ప్రభావం చూపుతాయన్నారు. ఒత్తిడికి గురికాకుండా సమస్య పరిష్కారం దిశగా ఆలోచిస్తే మానసిక ఆరోగ్యం బాగుంటుందని ఆయన తెలిపారు. ఆందోళన, ఒత్తిడి డిప్రెషన్‌కు దారితీస్తాయని, వాటికి దూరంగా ఉంటూ పౌష్టికాహారం, రోజులో గంట వ్యాయామం చేస్తూ తగు జాగ్రత్తలు పాటించినట్లయితే మానసిక రుగ్మత లేకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని ఆయన సూచించారు.

నిరుపేదలకు భూములు పంచాలి

- టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకన్న

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు భూములు పంచి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పాకాల వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో ప్రజాఫ్రంట్ 15సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టీపీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ గద్దర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ ఏర్పాటు అయిందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం టీపీఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కడమంచి, యాకస్వామి జిల్లా ఉపాధ్యక్షుడు మెడ రంజిత్, సహాయ కార్యదర్శి గొంగల్ల మల్లేష్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



టీపీఎఫ్ జెండా ఎగురవేస్తున్న నాయకులు

పాఠశాలల బలోపేతానికి పాటుపడాలి

బచ్చన్నపేట: గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లాకు చెందిన ముక్తవరం కరంచంద్ ముక్తి దాత అమ్మమ్మ ఊరు అయిన పోచన్నపేట గ్రామంలోని సెకండరీ పాఠశాలలో రూ.4.50 లక్షలతో మౌలిక వసతులు కల్పించారు. కాగా, అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఎంఈఓ మాట్లాడారు. అమ్మమ్మ ఊరు పట్ల మక్కువ చూపడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎ.హరిశంకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ బాలమణి, దాత కుటుంబ సభ్యులు వసుమతి, ఛత్రపతిశివాజీ, ఝాన్సీ, హైందవి, ఉపాధ్యాయులు ఝాన్సీలక్ష్మీబాయి, రత్నదేవి, సంధ్యారాణి పాల్గొన్నారు.



పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి, దాత

ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా బీఆర్‌ఎస్‌దే విజయం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: ఎప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించినా నియోజకవర్గంలో అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ 22 నెలల పాలనలో బాకీ కార్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అగడానికి వస్తారని అన్నారు. బాకీ కార్డులను ప్రతి ఇంటి గడపకు తీసుకువెళ్లాలి ప్రచారం చేయాలన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, పుస్కూరి శ్రీనివాస్‌రావు, పాము శ్రీను, మాచర్ల ఎల్లయ్య, మహేందర్‌నాయక్, కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాకీ కార్డులు ఆవిష్కరిస్తున్న దయాకర్‌రావు

చేగువేరాకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జనగామ రూరల్: ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీ శ్రీనివాస ఒకేషనల్ కళాశాలలో చేగువేరా వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పోదల లవకుమార్.. చేగువేరా చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలి

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జాడి రాజు



కార్యక్రమంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

జనగామ రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ సత్తా చాటేందుకు కార్యకర్తలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జాడి రాజు అన్నారు. మాన్యవర్ కాన్షీరాం వర్ధంతిని గురువారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్ అధ్యక్షతన పట్టణంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ జెరిపోతుల మల్లయ్య, ఉపాధ్యక్షుడు నారబోయిన రాజు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి తాండ్ర అఖిల్, గువ్వల భిక్షపతి, తాండ్ర లావణ్య, మబ్బు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం..

- బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రఘునాథపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఉడుత రంజిత్‌యాదవ్ అధ్యతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కావటి ముత్యాలు, తుమ్మలపల్లి సోమేశ్వర్, కల్వగూరి ప్రభాకర్, ద్వావర రాజు, మల్కపురం శ్రీకాంత్, వల్లాల ఉపేందర్; వల్లపు తిరుమలప్రసాద్, మర్కాల వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, యామంకి కొమురెల్లి, చందర్ నాయక్, రామచంద్రం, హుస్సేన్, గణేష్, శ్రీనివాస్, ప్రవీణ్, అంజనేయులు పాల్గొన్నారు.

సీపీఎంతోనే గ్రామాల అభివృద్ధి



పాలకుర్తి టౌన్: సీపీఎంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఐలమ్మ స్మారక భవనంలో సీపీఎం ముఖ్యకార్యకర్తల సమావేశంలో కనకారెడ్డి మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు చిట్యాల సోమన్న, మాచర్ల సారయ్య, సోమ సత్యం, మదార్, నాగయ్య, ఇంద్రారెడ్డి, బెల్లి సంపత్, బచ్చు శ్రీలత, మల్లేష్, కాకర్ల రమేష్, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపును కాపాడుకోవాలి

బచ్చన్నపేట: ప్రతీ ఒక్కరు కంటి చూపును కాపాడుకోవాలని మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కంటిచూపును కాపాడుకునేందుకు అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కంటిచూపు మెరుగు కోసం ఆకు కూరలు, కూరగాయాలు, క్యారెట్, పాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. నేత్ర వైద్య నిపుణురాలు అరుణకుమారి, దీప్తి, రాములు, సిద్దిసుదర్శన్‌రెడ్డి, క్రాంతిస్వరూప్, లక్ష్మీప్రసన్న కృష్ణ, ఫార్మాసిస్ట్ బొడ్డు శ్రీనివాస్, నర్సులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

బలమున్న స్థానాల్లో బరిలో ఉంటాం



జఫర్‌గఢ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎంకు బలమున్న స్థానాల్లో మాతో కలిసి వచ్చే శక్తులతో కలిసి పోటీ చేస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. మండలంలోని సాగరం గ్రామంలో నల్లబెట్ల కుమార్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండేది కమ్యూనిష్టు పార్టీ మాత్రమేనన్నారు. నక్క యాకయ్య, మూడిక కొమురయ్య, నల్లబీట్ల రమేశ్, పిడుగు యాకన్న, బాణాల రవి, సాయిలు, రాజు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం'

కొడకండ్ల: బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దేశగాని సతీశ్‌గౌడ్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూ కపట ప్రేమతో బీసీలను వంచిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, అమలులో విఫలమైందని, రిజర్వేషన్ల పరిమితి 50 శాతం గురించి ముందే తెలిసి కూడా డ్రామాలాడుతుందని ఆయన ఆరోపించారు.

'బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బీజేపీ'

బచ్చన్నపేట: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ల పెంపును అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపునకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.

స్టే దురదృష్టకరం..

జనగామ రూరల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలే అడ్డుకుంటున్నాయని, రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని బీసీ సంక్షేమ శాఖ పట్టణ అధ్యక్షుడు జాయ మల్లేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

'హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు'

స్టేషన్‌ఘన్‌పూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ బీసీ

సంక్షిప్త సమాచారం

కులాలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు అని బీజేపీ జిల్లా నాయకుడు మందపురం సతీష్ అన్నారు. ఘన్‌పూర్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా బీసీలపై చిత్తశుద్ధి ఉంటే బీసీల రిజర్వేషన్లలో ముస్లింలను తొలగించి దాదాపు 56 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై గౌరవం లేని రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి కుటిల రాజకీయాలతో బీసీలను దగా చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను బీసీలు గుర్తించాలని, రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు.

'బీసీ సామాజిక వర్గాన్ని మోసం చేసే చర్యలు తగవు'

దేవరుప్పుల: పార్లమెంట్ ప్రక్రియ ద్వారా అమలు చేయాల్సిన రిజర్వేషన్ విధానాలకు తిలోదకాలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సామాజిక వర్గానికి మోసం చేసే చర్యలు తగవని ఓయు జేఏసీ సభ్యుడు, బీఆర్‌ఎస్ నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి అన్నారు. 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీఓ 9 చట్టబద్ధంగా చెల్లదని తెలిసి కూడా బీసీ సామాజికవర్గాన్ని మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ నాటకం ఆడిందన్నారు. బీసీల రిజర్వేషన్ల కోసం పార్లమెంట్లులో కొట్లాడి, బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బీసీ బిల్లును భారత రాజ్యాంగం షెడ్యూల్ 9 లో చేర్చడానికి పాటుపడాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్‌ను కలిసిన సతీష్‌రెడ్డి



బచ్చన్నపేట: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి గురువారం కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో బస్ భవన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ప్రాంత పరిస్థితులను వివరించామన్నారు. నాయకులు ఉన్నారు.

ఒకరి రిమాండ్

దేవరుప్పుల: ఓ వ్యక్తిపై ఇద్దరు దాడికి పాల్పడిన కేసులో ఒకరికి రిమాండ్ విధించినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. రామరాజుపల్లి గ్రామానికి చెందిన లేగ నరసింహారెడ్డిపై జూన్ 6వ తేదీన లేగ హరీష్‌రెడ్డి, దశరథరెడ్డి దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై వారిద్దరిపై కేసు నమోదు చేశారు. ఇందులో గురువారం లేగ హరీష్‌రెడ్డిని జనగామ కోర్టులో జడ్జి ఎదుట హాజరు పరుచగా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

స్వపరిపాలన కోసం స్వతంత్రంగా దిగుతున్నాం..



దేవరుప్పుల: ప్రజాపాలన కోసం పాటుపడిన కాంగ్రెస్ శ్రేణులు అంతర్గతంగా దగాపడుతున్న తరుణంలో స్థానిక ఎన్నికల ద్వారా స్వపరిపాలన పొందేందుకు స్వతంత్ర అభ్యర్థులను బరిలో దించుతున్నట్లు కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ధర్మపురం, కడవెండి, కోలుకొండ గ్రామాల్లో కాంగ్రెస్‌కు రెబల్‌గా స్వతంత్ర అభ్యర్థుల ఖరారు సమావేశాలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాటుపడిన కాంగ్రెస్ పార్టీ నాయకుల అభిప్రాయాల మేరకు ఆత్మగౌరవం కోసం పోటీలో అనివార్యంగా ఉండాల్సి వస్తుందన్నారు. భద్రు నాయక్, అజయ్, కొడగాని సోమనర్సోజీ, మహేందర్, సంగీత, వినోద, మౌనిక, రజిత, స్వరూప పాల్గొన్నారు.

మోసపూరిత విధానాలను నిలదీయండి

దేవరుప్పుల: బోగస్ హామీలతో పరిపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను నిలదీయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నీర్మాలలో సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్, మలిపెద్ది శ్రీనివాస్‌రెడ్డి, కాడబోయిన ఐలయ్య పాల్గొన్నారు.

ఎన్నిక

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి క్రూజర్ (తూఫాన్) యూనియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా డి. సుమన్‌రావు, అధ్యక్షుడిగా మార్గం సారంగపాణి, ఉధ్యక్షుడిగా బెల్లపురి యాకన్న, ప్రధాన కార్యదర్శిగా భూక్య మల్లేష్, సహాయ కార్యదర్శిగా పూజారి వెంకటేష్, కోశాధికారిగా గోనె రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నీరటి మధు, పంగ వెంకన్న, బుర్రి భాస్కర్, కొనుకటి సోమన్న, సైదులు, ఆకుల అశోక్, కొమ్ము యాకన్న, అంబటి సోమేష్ ఎన్నికయ్యారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీలు

జనగామ రూరల్: పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పని సరిగా అందించాలని అంగన్వాడీ సెంటర్-1 టీచర్ చేపూరి లలిత అన్నారు. గురువారం చీటకోడూర్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ లో ఘనంగా పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

అతిథి భోజనం



చిల్పూరు: మండలంలోని వంగాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం అపాదిక్ మూడో పుట్టిన రోజును పురస్కరించుకుని విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. జీపీ కార్యాలయంలో వర్కర్‌గా పనిచేస్తున్న గోరుమియా మనువడి పుట్టిన రోజును పురస్కరించుకుని భోజన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. హెచ్‌ఎం దామెర సరిత, నాయకులు చిట్యాల దయాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.